# పుచ్చ మరియు దోసపండు

పుచ్చపండు (తర్బూజా) మరియు దోసపండు (ఖర్బూజా) అనేవి తీగ పంటలు. వీటి సాగు ఎక్కువగా తీగజాతి కూరగాయలయిన గుమ్మడి, ఆనపలను పోలి వుంటుంది. వీటిల్లో తక్కువ కాలరీలు, ఎక్కువ శాతం విటమిన్ 'ఎ' మరియు 'సి' ఉండటమే గాక దాహాన్ని తీర్చే గుణం కలిగి వుంటాయి. ఇవి అధిక ఉష్ణోగ్రత వున్న ప్రాంతాల్లో బాగా పెరుగుతాయి. తక్కువ ఉష్ణోగ్రతను సాధారణంగా ($18^0$ సెల్సియస్ కంటే తక్కువ) తట్టుకోలేవు.

**వాతావరణం :** ఎక్కువ ఉష్ణోగ్రతతో ($32^0$ సెల్సియస్ వరకు) కూడిన పొడి వాతావరణం అనుకూలం. $23^0$-$27^0$ సెల్సియస్ ఉష్ణోగ్రత కూడా అనుకూలం. నది యొక్క ఇసుక తిన్నెల్లో ఎక్కువగా సాగుచేస్తారు. వాతావరణంలో ఎక్కువ తేమ దీనికి అనుకూలంకాదు.

**నేలలు :** ఇసుక నేలలు, బంకమన్ను కలిగిన నేలలు, మురుగు నీటి వసతితో ఒండ్రు కలిగిన ఇసుక నేలలు, ఉదజని సూచిక 6.0-6.7 వున్న నేలలు సాగుకు అనువైనవి. సాగు నీటి వసతి గల నేలల్లో బోదెలు ఏర్పరచి విత్తనాలను బోదెకు ఎక్కువగా విత్తుకోవాలి.

**విత్తే సమయం :** డిసెంబరు రెండవ పక్షం నుండి జనవరి మొదటి పక్షం.

**రకాలు**

**పుచ్చపండు రకాలు**

**అసాహి యమాటా :** 6-8 కిలోల బరువుతో, మధ్యస్థంగా, పైన లేతాకుపచ్చ రంగు లోపల చిక్కటి గులాబి రంగు కండ కలిగి వుంటుంది. 11-13% చక్కెరతో, 95 రోజుల్లో పండ్లు పక్వానికి వచ్చి, ఎకరాకు 90 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది.

**సుగర్ బేబి :** త్వరగా వేసుకోవడానికి అనుకూలం. కాయలు చిన్నవిగా 2-3 కిలోల బరువుతో, గుండ్రంగా పైన నీలివర్ణపు నలుపుతో, లోన చిక్కటి గులాబీరంగు కండను కలిగి వుంటాయి. 11-13% చక్కెరతో, 80-85 రోజుల్లో పక్వానికి వచ్చి ఎకరాకు 60 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది.

**అర్కజ్యోతి, అర్కమానిక్ :** పండ్లు గుండ్రంగా, పైన ఆకుపచ్చ, ముదురాకుపచ్చ చారలతో, లోపల ఎరువు కండను కలిగి వుంటాయి. 6-8 కిలోల బరువుతో ఎకరాకు 80 క్వింటాళ్ళ దిగుబడినిస్తాయి.

**దుర్గాపూర్ కేసర్ మరియు దుర్గాపూర్ మీఠా :** ఆలస్యంగా కోతకు వచ్చి, కోసిన తర్వాత ఎక్కువ కాలం నిలువ ఉంటాయి.

**దోసపండు (ఖర్బూజా) రకాలు**

**తెల్లటి కండ రకాలు**

**అర్క రాజహన్స్ :** పండ్లు కోలగా ఉండి, ఒక కిలో బరువు కలిగి పండిన పండుపై సన్నని వల మాదిరిగా గీతలుంటాయి. రవాణాకు అనుకూలం. బూడిద తెగులును కొంతవరకు తట్టుకుంటుంది.

**అర్కజీత్ :** పండ్లు చిన్నవిగా గుండ్రంగా, బల్లపరువుగా ఉండి ఒక్కో పండు 300-500 గ్రా. బరువు ఉంటుంది. పై పొర నారింజ రంగులో ఉండి, లోపలి కండ తెల్లగా తియ్యగా (టి.యస్.యస్. 12-14%) ఉంటుంది. పంటకాలం 85 రోజులు.

**నారింజ రంగు కండ కలిగిన రకాలు**

**పూసాషర్బతి :** పండ్లు గుండ్రంగా ఉండి, కండ నారింజ రంగుతో మందంగా, ఒక మోస్తరు తీపితో (11–12% టి.యస్.యస్.) ఉంటుంది. పంటకాలం – 85 రోజులు.

**పూసా మధురస్ :** పండ్లు గుండ్రంగా, బల్లపరుపుగా ఉండి, ఒక కిలో బరవుంటాయి. పండు పై తొక్క లేత ఆకుపచ్చరంగులో, కండ నారింజ రంగులో తియ్యగా (12–14% టి.యస్.యస్.) ఉంటుంది. నిలువ కాలం తక్కువ.

**పంజాబ్ సునహేరి :** పండ్ల పై తొక్క లేతాకుపచ్చ రంగు ఉండి, కండ నారింజ రంగులో, ఒక మోస్తరు తీపితో (11–12% టి.యస్.యస్.) ఉంటుంది.

**ఆకుపచ్చ కండ కలిగిన రకాలు**

**హర మధు :** పండ్లు గుండ్రంగా లేక చదునుగా వుండి పచ్చరంగుతో తియ్యటి కండతో వుంటాయి. షుమారు కిలో బరువు వుంటాయి. ఎక్కువ కాలం నిలవ వుండవు. ఆలస్యంగా కోతకు వచ్చేరకం.

**దుర్గాపుర మధు :** పండ్లు కోలగా, 500–600 గ్రా. బరువుతో లేత ఆకుపచ్చటి గట్టి తీయటి కండ కలిగి, త్వరగా కోతకొచ్చే రకం.

యివికాక నామ్‌ధారి మరియు ఇండో అమెరికన్ హైబ్రిడ్స్ మార్కెట్‌లో లభిస్తున్నాయి.

**విత్తనాలు, విత్తటం :** 2–2.5 మీ. ఎడంతో, 60 సెం.మ.ఈ వెడల్పుగల నీటి కాలువలను తయారు చేసుకోవాలి. కాలువలకు ఇరువైపులా 30–50 సెం.మీ. ఎడంతో విత్తనాలు విత్తుకోవాలి. 500–600 గ్రా. విత్తనం ఒక ఎకరాకు సరిపోతుంది. ఉష్ణోగ్రత తక్కువగా వున్నపుడు విత్తనాలను 6 x 4 సైజుగల ప్లాస్టిక్ సంచుల్లో (1 భాగం చొప్పున ఇసుక, ఎరువు, 2 భాగాలు మట్టితో నింపినవి) విత్తుకోవాలి. 2–3 ఆకుల దశలో ముందుగా తయారుచేసుకున్న కాలువల్లో నాటుకోవాలి.

**ఎరువులు :** ఎకరాకు 4–5 టన్నులు బాగా మాగిన పశువుల ఎరువును వేయాలి. 32–40 కిలోల భాస్వరం, 16–24 కిలోల పొటాష్ మరియు 40 కిలోల నత్రజనినిచ్చే ఎరువులు వేయాలి. నత్రజనిని రెండు దఫాలుగా, నాటేటప్పుడు మరియు నాటిన 25 రోజుల తర్వాత వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం :** ప్రథమ దశలో, మళ్ళీ కాయ ఎదిగేటప్పుడు నీటిని ఇవ్వాలి. కాయలు పక్వానికి వచ్చిన తర్వాత ఎక్కువ నీరు కట్టడం వల్ల కాయలు పగిలి నాణ్యత తగ్గుతుంది.

**అంతరకృషి :** కలుపు నివారణకు పెండిమిథాలిన్ మందును ఎకరాకు 1.25 లీ. లేదా అలాక్లోర్ 1.0 లీ. (తేలిక నేలలు), 1.25 లీ. (బరువు నేలలు) చొప్పున 200 లీటర్ల నీటిలో కలపి నాటిన 48 గంటలలోపు పిచికారీ చేయాలి. 2–4 ఆకుల దశలో 3–4 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయడం ద్వారా దిగుబడి పెంచవచ్చు. పూత రావడానికి ముందు తీగ చివర్లు తుంచడం వల్ల ప్రక్క తీగలు అభివృద్ధి చెంది దిగుబడి పెరుగుతుంది.

**సస్యరక్షణ :** పందిరి కూరగాయల సస్యరక్షణ చర్యలనే పాటించాలి.

**దిగుబడి :** పుచ్చపండు : 8–10 ట/ఎకరా. దోసపండు : 4–5 ట/ఎకరా.

పుచ్చ, దోసల సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా **251వ** పేజీలో ఇవ్వబడింది.